క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కొల్లాపూర్: అర్హులైనవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పూర్తికాకముందే కొందరు నాయకులు తాము ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హులను ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా చూడాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక పట్టణంలో ఆదివారం శ్రీరామసేన సొసైటీ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కానాపురం శ్రీనివాసులు, కన్వీనర్‌గా తీగల భాస్కర్, అధ్యక్షుడిగా గొల్ల నిరంజన్, ఉపాధ్యక్షుడిగా కుంభం మల్లేష్ గౌడ్, సత్యనారాయణ, కార్యదర్శిగా ఏటిగడ్డ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా వీరయ్య, శంకరయ్య, కోశాధికారిగా పుల్లయ్య తోపాటు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తాడూరు: మండలంలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు హెచ్‌ఎం శేషగిరి ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయురాలు సమీర తోటపల్లికి,, చెన్నయ్య పెద్దపూర్‌కు, మరో ఉపాధ్యాయుడు తుమ్మలసూగురు పాఠశాలకు బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నరాములు, గ్రామస్తులు యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలతో సమావేశం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పద్మావతి జూనియర్ కళాశాలలో ఆదివారం ఎస్‌ఐ సతీష్ ఆర్‌ఎంపీలతో మండల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న ఆర్‌ఎంపీలు రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. అనంతరం జయకృష్ణ ఆస్పత్రి ఫిజిషియన్ గుండె వ్యాధుల నిపుణులు దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ తండాలు మారుమూల ప్రాంతాలలో ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స చేపట్టి వ్యాధి లక్షణాలు, తీవ్రతను బట్టి పై ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. ఆర్‌ఎంపీ సంఘం మండల అధ్యక్షుడు కురుమూర్తి, ఉపాధ్యక్షుడు గజేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి భూపాల్‌నాయక్, ప్రచార కార్యదర్శి సతేశ్వరం, కార్యదర్శి శివ, గౌరవ అధ్యక్షుడు నర్సింహా శర్మ, కృష్ణారెడ్డి, విష్ణుప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

వెల్దండ: మండల కేంద్రంలోని రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, క్రీడా కార్యదర్శి అమర్‌నాథ్‌యాదవ్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తునట్లు వివరించారు. ఆసక్తిగల వారు ఈ నెల 10వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా సిద్ధిబుద్ధి దేవాలయంలో హోమం

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌లో సిద్ధిబుద్ధి విజయ గణపతి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక హోమం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడింది. చివరి రోజు కావడంతో వేద పండితులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూజారి జోషి, వేద పండితులు, భక్తులు, తదితరులు ఉన్నారు.



కూరగాయల సాగుతో లాభాలు



పెద్దకారుపాములలో టమాట సాగు చేసిన రైతు

పెద్దకొత్తపల్లి: సాంప్రదాయ వ్యవసాయానికి రైతులు స్వస్తి పలుకుతున్నారు. వివిధ పంటలు, కూరగాయల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యవసాయ అధికారుల, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటమార్పిడీపై అవగాహన కల్పించడంతో రైతులు నూతన పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పెద్దకారుపాముల గ్రామానికి చెందిన పదిర మనోహర్ రెడ్డి గతంలో వేరుశనగ, రాగి, మొక్కజొన్న, కంది పంటలను సాగు చేసి నష్టపోయాడు. గత ఐదేళ్ల నుంచి కూరగాయల సాగు చేపట్టాడు. మిర్చి, టమాట, కాకర, బీర, బెండ, దొండ కూరగాయలను రెండు ఎకరాల పొలంలో సాగు చేశాడు. ఏడాదికి రూ.4 లక్షల ఆదాయం పొందుతున్నాడు. అన్ని సీజన్‌లో సాగు అవుతుండటంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం వంగా, టమాట, బీర, కాకర సాగు చేసి కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి కూరగాయల సంతల్లో విక్రయిస్తాడు. కాకర కిలో రూ.50, టమాట రూ.20, వంగ రూ.30 చొప్పున కూరగాయల వ్యాపారులకు అమ్ముతున్నాడు.

ఐదేళ్లుగా సాగు చేస్తున్నా



వేరుశనగ, కంది, రాగి, మొక్కజొన్న పంటలు వేసి నష్టపోయాను. ఐదేళ్ల నుంచి కూరగాయల సాగు చేపట్టాను. తక్కువ పెట్టుబడి అధికంగా లాభాలు పొందుతున్నాను. వంగ, మిరప, చిక్కుడు, బీర, కాకర, టమాట సాగును చేశాను. సొంత ఆటోలో మార్కెట్లకు తరలించి వ్యాపారులకు విక్రయిస్తున్నాను.

– పదిర మనోహర్ రెడ్డి, రైతు, పెద్దకారుపాముల



సాగుచేసిన బీర

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

చారకొండ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా మారిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పడమటి తండాకు చెందిన కోర్రవత్ కోమిటికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం లబ్ధిదారురాలికి ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. అదేవిధంగా జూపల్లి గ్రామానికి చెందిన బాత్క తిర్పతయ్యకు రూ. 60 వేలు, కొక్కరి మణెమ్మకు రూ. 60 వేలు, అంకిల్ల గెల్వయ్యకు రూ.15 వేలు, బచ్చాలుకు రూ. 26 వేలు, చిట్టికి రూ. 16 వేలు చెక్కులను గ్రామంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రాములు, కుమార్‌సింగ్, గోపి, దేవేందర్, గోపాల్, లక్ష్మణ్, రవి, బాల్‌రాజు, రాములు యాదవ్ తదితరులు ఉన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: హైదరాబాదులోని ఇందిరా పార్క్ ఎదుట నిర్వహిస్తున్న దళిత హక్కుల పోరాట సమితి జాతీయ మహాసభకు నాగర్‌కర్నూల్ నుంచి ఆ సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్, ఆ సంఘం జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి మాట్లాడుతూ దళితుల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. శివ శంకర్, బండి శ్రీను సురేష్, ఉన్నారు.

తాడూరు: అఖిల భారత దళిత హక్కుల ఉద్యమ 2వ జాతీయ మహాసభలకు మండలంలోని ఆయా డీహెచ్‌పీఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ 5, 6, 7 తేదీలలో నిర్వహిస్తున్న మహాసభలకు మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి భారీగా కార్యకర్తలను తరలిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు కృష్ణ, నాగరాజు, రాము, ఆంజనేయులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులు

బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి తాడూరు వరకు ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని అయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు కమ్ముకోవడంతోపాటు కొన్ని చోట్ల బీటీ పూర్తిగా దెబ్బతింది. దీంతో రోడ్డుపై వెళ్లడానికి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల వద్ద చెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక తృటిలో ప్రమాదాలు తప్పిపోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు మార్గంలోనే పెనిమిళ్ల వరకు ఎక్కువ గ్రామాలకు వెళ్లడానికి అనువుగా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



దెబ్బతిన్న తాడూరు- ఉప్పునుంతల రోడ్డు

సింగోటంలో మెగా వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం ఉన్నత పాఠశాల ఆవరణలో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, గ్రేస్ ఫౌండేషన్, రాంకి ఫౌండేషన్, లైన్స్ క్లబ్, గ్రీన్ ల్యాండ్, సింగోటం గ్రామ స్వచ్ఛత సంస్థ ల ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషన్ ఆఫ్ పోలీసు హైదరాబాద్ మధుకర్ స్వామి సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కిమ్స్ డాక్టర్లు, ఫెర్నాన్‌డెజ్ ఆస్పత్రి డాక్టర్లు, ఎల్‌వీ ప్రసాద్ డెంటల్ డాక్టర్లు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 3800 మంది రోగులు చికిత్సలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, గ్రామ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సాగునీటి కాల్వలు కబ్జా!

చిన్నమారూర్ లిఫ్ట్ డి–2, ఎల్–2, జూరాల డి–36 కాల్వలు పూడ్చిన వైనం



చిన్నమారూర్ లిఫ్ట్ కాల్వ పూడ్చడంతో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

వనపర్తి/చిన్నంబావి: దీర్ఘకాలిక రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి కాల్వలు, ల్యాండ్ బ్యాంకు, మట్టినిల్వలకు భద్రత కరువైంది. కొంతకాలంగా చిన్నంబావి మండలంలోని చిన్నమారూర్ డి–2, ఎల్–2, జూరాల డి–36 కాల్వలను పూడ్చడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. సాగునీటి కాల్వల నిర్మాణం సమయంలో ప్రభుత్వం ప్రధాన కాల్వకు ఇరువైపులా సుమారు 40 ఫీట్లు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు ఇరువైపులా సుమారు 16 ఫీట్ల మేర ల్యాండ్ బ్యాంక్‌కుగాను భూ సేకరణ చేపట్టింది. కాల్వల మరమ్మతు, నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఇరువైపులా రెండు నుంచి నాలుగు భారీ వాహనాలు సులభంగా తిరిగేలా స్థలం కేటాయిస్తారు. భూముల విలువ రూ.లక్షలకు చేరడంతో సమీప పొలాల రైతులు ఏటా కొద్దికొద్దిగా జరుగుతూ తమ భూ విస్తీర్ణం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు రియల్ వ్యాపారులు చిన్నంబావిలోని జూరాల డి–36 అనుబంధ కాల్వ పూడ్చి షాపింగ్ కాంప్లెక్స్‌లు, భారీ నిర్మాణాలు చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు నోరు మెదపకపోవటం శోచనీయం.

2,500 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం..

చిన్నంబావి మండలంలోని చిన్నమారూర్ డి–2, ఎల్–2 కాల్వలు కబ్జాకు గురికావడంతో వెల్టూరు, అయ్యవారిపల్లి, కొప్పునూరులోని సుమారు 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. 2009 కృష్ణానది వరదల సమయంలో చిన్నమారూర్ లిఫ్ట్ మునిగి కొన్నాళ్లు మరమ్మతుకు నోచుకోలేదు. ఆ సమయంలో రియల్ వ్యాపారులు కాల్వలను కబ్జా చేసినట్లు ప్రచారంలో ఉంది. ఇటీవల అధికారులు లిఫ్ట్ మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు. కానీ నిర్దేశిత ఆయకట్టుకు నీరందుతుందా అనే విషయంపై పర్యవేక్షణ చేయకపోవడం గమనార్హం. పాలకులు, అధికారులు దృష్టిసారించి తమ పొలాలకు సాగునీరు అందించాలని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి..



కాల్వలను పూడ్చి దిగువ ఆయకట్టుకు నీరందకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆక్రమణకు గురైన కాల్వను తిరిగి తవ్వి వినియోగంలోకి తీసుకొస్తే ఏటా రెండు పంటలు పండించుకుంటాం. మా కష్టాలు తీరుతాయి.

– శివరాముడు, రైతు, వెల్టూరు (చిన్నంబావి)

యథేచ్ఛగా కబ్జా..



మండలంలో సాగునీటి కాల్వలను యథేచ్ఛగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కాల్వ ఆక్రమణకు గురికావడంతో మూడు గ్రామాలకు సాగునీరు అందటం లేదు. రియల్ వ్యాపారులు కాల్వల భూముల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. దిగువ ఆయకట్టుకు సాగునీరు అందకుండా చేస్తున్న వారిపై అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– మధు, రైతు, వెల్టూరు (చిన్నంబావి)

పరిశీలిస్తాం..

కాల్వల కబ్జాపై గతంలోనూ పలుమార్లు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రక్షణ వలయం ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపించాం. మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఆక్రమణల విషయంపై మరోసారి పరిశీలన చేస్తాం.

– జగన్మోహన్, ఈఈ, జూరాల ఎడమకాల్వ విభాగం

సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి



వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని రైతు కమిషన్ సభ్యుడు కేవీఎస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరులన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను రెచ్చగొట్టేందుకు ప్రతిపక్షాలు యత్నిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రైతుభరోసాపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించడం శుభపరిణామమన్నారు. సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఏడాదికి రూ.12వేలు చొప్పున ఇస్తామనడం సంతోషకరమన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు, రేషన్‌కార్డు లేనివారికి రేషన్‌కార్డు, ఇళ్ల పథకాన్ని ఈనెల 26 నుంచి ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో లాలూయాదవ్, వేమారెడ్డి, వంశీ, చందు పాల్గొన్నారు.

సగరుల సమస్యలు పరిష్కరించాలి



కల్వకుర్తిరూరల్: సగరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు కోరారు. ఆదివారం పట్టణంలో మాజీ ఎంపీ పోతుగంటి రాములు మంజూరు చేసిన నిధులతో నిర్మించిన సగర సంఘం కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సగరులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి పడకంటి రాజు సాగర్, గౌరవధ్యక్షుడు దుర్గయ్య సాగర్, సురేష్, రాజు, వివేకానంద, రాకేష్, జంగయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

నేడు అబ్దుల్ కలామ్ స్ఫూర్తి యాత్ర

వెల్దండ: మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌లో సోమవారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ స్ఫూర్తి యాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు సైన్స్ నైపుణ్య అంశాలపై ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టిఫిసియల్, రోబోటిక్, త్రిడి ప్రింటింగ్, ఇంటలిజెన్సీ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. చదువుతో పాటు విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించే విధంగా అబ్దుల్ కలామ్ స్ఫూర్తి యాత్ర ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

డీ 36 కాల్వలో రాళ్ల తొలగింపు

చిన్నంబావి: జూరాల చివరి ఆయకట్టు అయిన వెల్టూరు, చిన్నమారు, అయ్యవారిపల్లి, చెల్లపాడు గ్రామాలకు సాగునీరు అందడం లేదని, దీనికి ప్రధాన కారణం డీ 36 కాల్వ వెంబడి ఉన్న రైతులు కాల్వలో రాళ్లతో గోడ కట్టడమే ప్రధాన కారణమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కళ్యాణ్‌రావు దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన రైతులు, లస్కర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌తో కలిసి కాల్వలను సందర్శించారు. ఈసందర్భంగా చిన్నమారు నుంచి బెక్కెం గ్రామం వరకు కాలువ వెంబడి రైతులతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా కాల్వలో అడ్డుగా ఉన్న రాళ్లగోడలను రైతులతో కలిసి తొలగించారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి

తిమ్మాజిపేట: నాణ్యమైన ఎరువులు అందించాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మారేపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను, మందులను అందించాలని కోరారు. యువత స్వయం ఉపాధితో ఎదగాలన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు నేరళ్లపల్లి మనోహర్ మనువడు నితిన్ జోయల్ జన్మదినం సందర్భంగా వారి ఇంటికి వెళ్లారు. బాలుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కల్వకుర్తి ఎంఈఓ శంకర్ నాయక్, మాడుగుల ఎంఈఓ సర్దార్‌నాయక్, సీనియర్ నాయకుడు మల్లయ్యలు ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, సత్యనారాయణ గౌడ్, పరశురాములు, బాలరాజ్, వెంకటేశ్వర్లు, నెహ్రూప్రసాద్, రాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

వాహనాల తనిఖీ



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిలో సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించని వారికి రోడ్డు నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. అమ్రాబాద్ రహదారిలో డ్రంకెన్‌డ్రైవ్‌ను పరీక్షలు చేశారు. అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి-యాపట్ల మధ్యలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో రెండు కేసులను నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడుపుతూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపినా, హెల్మెట్ ధరించక పోయినా, వాహనానికి సంబంధించి సరైన పత్రాలు లేక పోయినా కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఆదివారం ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచింది. విద్యుత్ తీగలు తెలిపోవడంతో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'పాలమూరు'కు జైపాల్‌రెడ్డి పేరు హర్షణీయం

కల్వకుర్తి రూరల్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు దివంగత నేత ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి పేరును పెట్టడం హర్షణీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, రాష్ట్ర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

బల్మూర్: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ టు ఆల్ కరాటే అండ్ కింగ్ ఫూ టెక్ వందో ఛాంపియన్ షిప్– 2025 పోటీల్లో మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన బాల, బాలికలు ప్రతిభ చాటారు. మొదటి బహుమతి పొందినట్లు కరాటే మాస్టర్ బ్లాక్ బెల్ట్ బాలుయాదవ్ తెలిపారు. బహుమతులను బ్లాక్ బెల్ట్ ఐదవ డాన్ విశ్వేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. బాలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు పంపిణీ



లింగాల: హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తెలంగాణ సాగర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే యూత్ క్రికెట్ పోటీలలో పాల్గొనే మండలంలోని అంబట్‌పల్లికి చెందిన సాగర్ సంఘం యూత్ క్రీడాకారులకు ఆదివారం గ్రామానికి చెందిన సాగర్ సంఘం నాయకులు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. పోటీలలో మంచి ప్రతిభ కనబర్చి గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, అతినారపు తిర్పతయ్య, జనార్దన్, సాయి, వెంకటస్వామి, లింగస్వామి, బాబు, శ్రీను పాల్గొన్నారు.

మండల అధ్యక్షునిగా మహేష్ ఎన్నిక

పెద్దకొత్తపల్లి: అఖిల భారతీయ విశ్వకర్మ జాతీయ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దకొత్తపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం నూతన మండల కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా అఖిల భారతీయ విశ్వకర్మ జాతీయ మహాసభ జిల్లా అధ్యక్షుడు నరేందర్ చారి హాజరయ్యారు. నూతన కమిటీ మండల అధ్యక్షుడిగా కోలాటం మహేష్ చారి, గౌరవ అధ్యక్షుడిగా పి చంద్రశేఖర్ చారి ఉపాధ్యక్షుడిగా ఎల్లోజు ప్రసాద్ చారి, కార్యదర్శిగా పస్పునూరి రాజుచారి, ప్రధాన కార్యదర్శి నారాయణ దాస్ నరసింహచారి సహాయ కార్యదర్శి పుట్టపాగ రంగాచారి, సమన్వయకర్తగా గన్నోజు బ్రహ్మయ్య చారి, కోశాధికారిగా గన్నోజు మహేష్ చారి, ముఖ్య సలహాదారుగా రఘుప్రోలు జనార్దన్ చారి సలహాదారుగా రామచంద్రయ్య చారి ని మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన విశ్వబ్రాహ్మణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి

కొల్లాపూర్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. విద్యార్థులు ఉండలేని పరిస్థితి దాపురించిందన్నారు. గత్యంతరం లేక ప్రైవేటు భవనాల్లో హాస్టళ్ల నిర్వహిస్తున్నారని వాపోయారు. పాలకులు స్పందించి శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తలసాని కృష్ణారెడ్డి, దేశం పుల్లారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి బాలమ్మకు రూ.5500 ఆర్థిక సాయం అందజేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, కృష్ణయ్య, మల్లేష్, మదన్ మోహన్ రావు, రామ్‌రెడ్డి, లింగం, తదితరులు పాల్గొన్నారు.